"హలో... కృష్ణమూర్తా... ఏమిటి విశేషాలు... బాగున్నావా? మరేంలేదు... హలో... కృష్ణమూర్తీ... నా భార్య ఈ రోజు ఉదయం చనిపోయిందోయ్... నలుగురు మనుషులు కావాలి... నువ్వేమయినా ఎరేంజ్ చేయగలవని..."

# నలుగురితో నారాయణ



నల్లబాటి రాఘవేంద్రరావు

"అయ్యోపాపం... తెలుసుకొని ఒక్క నిమిషంలో ఫోన్ చేస్తాను. లైన్‌లో ఉండండి సార్...'

"..... ....."

"సారీ సా...ర్... ఎవరికీ రావడానికి..."

"పోనీ... నువ్వు..."

"ఆఁ.. నేనా... నేనా సార్... మీకు తెలుసుగా సార్... నాకు కీళ్ల నొప్పులు ...అయినా మూడొంతులు ట్రై చేస్తాను సార్"

"ఫోన్ పెట్టెయ్."

★ ★ ★

పరమేశ్వరం డబ్బు విసురుకుంటూ, డబ్బు మీద నడిచే మనిషి. 30 సంవత్సరాలు హోదా అయిన జడ్జి ఉద్యోగానికి మరింత హోదా పెంచి, రిటైర్ అయ్యాక కూడా ఆ హోదా ఛాయలు ఏ మాత్రం వీడకుండా బ్రతగ్గలుగుతున్నాడు... అంటే... అది పరమేశ్వరం గొప్ప కాదు... అతను సంపాదించిన డబ్బు గొప్పతనమే!

కాసులు రాసుల్లా పోగుపడ్డాయి. కనకం కుండపోతగా కురిసి కురిసి ఇల్లు విండింది. మూడంతస్తుల పాలరాతి భవనం చూడముచ్చటైన ప్రపంచ అద్భుతాల్లో ఒకటిగా ఉండాలని కోట్లు గుమ్మరించి, రూట్లు అడ్డు తొలగించుకొని నిర్మించాడూ... అంటే అది పరమేశ్వరం గొప్పతనం కాదు... అతను సంపాదించిన డబ్బు మహిమే!

ఆ డబ్బుతో మనుషుల్నే కాదు... వాళ్ల మనసునీ, మమతానురాగాన్నీ కూడా కొనెయ్య గలను అనుకునే వ్యక్తి అతను!

కళ్లు తెరిస్తే డబ్బు... కళ్లు మూస్తే డబ్బు. నోరు తెరిస్తే డబ్బు. నోరు మూస్తే డబ్బు! అదే సంపాదనగా డబ్బు ప్రపంచంలో మునిగిపోయా డతను!

★ ★ ★

"హలో పవన్‌కుమార్"

"అమెరికా నుంచేనా?..."

"ఆ... బాబూ... మీ నాన్న పరమేశ్వరాన్ని... మరేంలేదు... నీ ఆరోగ్యం బాగుందా.

వారం వారం కథాప్రభ

కోడలేం చేస్తుంది...? చెప్పటం మర్చాను... నిన్న మీ అమ్మ... స్వర్గస్తురాలయిందిరా. ఇంకా శవాన్ని తీసుకెళ్లలేదు... నువ్వు..."

"......"

'ఏమిటీ, రావడానికి వీలువడదా? కార్యక్రమాలు నన్నే ముగించెయ్యమంటావా. స్టుపిడ్! నిన్ను రమ్మని చెప్దామని ఫోన్ చేయలేదు. 'తండ్రిగా నా కారెక్టర్ నీకు నచ్చలేదు' అని ఏనాడైతో చెప్పావో, ఏనాడైతే నన్నొదిలి వెళ్లిపోయావో ఆనాడే కొడుకు చచ్చిపోయాడని నిర్ణయించేసుకున్నాను.'


"....."

"...షటప్, డబ్బు పడేస్తే... వీధి కొక్క కొడుకు నాకు తయారవుతాడు. నా దగ్గర డబ్బుంది. కొడుకు కన్నా గొప్ప దది!

"స్కౌండ్రల్! ఇప్పుడు నా ఇంట్లో నౌకరు, నా వ్యాపారాలు చూసే మేనేజర్ నీ కన్నా ఎక్కువ... నోర్మూసుకొని ఫోన్ పెట్టెయ్..."

★ ★ ★

అప్పాజోస్యుల - విష్ణుభొట్ల ఫౌండేషన్ (యుఎస్ఏ), ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నిర్వహించిన కథల పోటీలో 'కథాప్రభ'కు ఎంపికైన కథ



పరమేశ్వరం ద గ్రేట్ రిటైర్డ్ జడ్జ్ వాలుకుర్చీలో జారపడి తదేకంగా ఆలోచిస్తున్నాడు.

ఎదురుగా భార్య శవం... 'ఏమండీ! నా శవ యాత్ర ఎప్పుడు?' అన్నట్టు ప్రశ్నిస్తోంది.

ఒక్కసారిగా పైకి లేచాడు. తన బెడ్‌రూంలోకి వెళ్లాడు. భార్య డ్రెస్సింగ్ టేబుల్ మధ్య అరలో ఉన్న లాక్ తీసుకొని పురాతన కాలంనాటి నెంబర్ బీరువా తెరిచాడు.

ఓ పక్క నోట్ల కట్టలు మూలుగుతున్నాయి.


మరో పక్క బంగారు దిమ్మలు బరువుగా పడి ఉన్నాయి.

వైడూర్యాలు, ముత్యాలు, పగడాలు, గోమేధికాలు, మరకతాలు, మాణిక్యాలు, పచ్చలు, నీలాలు, కెంపులు... తెల్లని ఫారిన్ గాజు సీసాల్లో వేసి అందంగా పేర్చబడి ఉన్నాయి.

మరో పక్క చాదీ వెండి విచిత్ర శిల్పాలు రమణీయంగా ఉన్నాయి. బంగారు పట్టుచీరలు, వెండి జరీ చీరలు లెక్కలు మించి ఉన్నాయి. కొన్ని కోట్ల ఖరీదు చేసే బీరువా అది!

మరో పక్క అతి చిన్న సీక్రెట్ రూం తెరచి చూశాడు. బంగారు ఊయల... ధగధగ... కాంతులతో... మెరిసిపోతూ ఉంది. తన విలువ తనకే తెలియని పొజిషన్ పరమేశ్వరానిది!

ఆ పొజిషన్ అంతా కుమ్మరించి తన కులం వాళ్లని, స్నేహితులను, ఇరుగు పొరుగువాళ్లను ఈనాడు కొనలేడా తను? అఫ్కోర్స్ ఎందుకు కొనలేడూ? డబ్బు ఏదైనా సాధించగలదు అన్నది అతని సిద్ధాంతం మరి! అంతా చూసి వచ్చి వాలు కుర్చీలో జారపడిన అతనికి మేనేజరు దగ్గరకొచ్చి చెప్పిన విషయం అతని తలలో జోరీగలా ప్రతిధ్వని చేస్తూ తిరుగుతోంది. 'మరి అంత ధనికుడైన అతని భార్య శవాన్ని బంధువులుగాని, వీధిలో వాళ్లుకాని శ్మశానానికి తీసుకు వెళ్లడానికి సముఖంగా లేరట. తలకు వెయ్యి రూపాయలు ఆశ చూపినా ఎవరూ రారట' - ఇదీ మేనేజరు చెప్పిన విషయం!




చీకటి పడింది.

శవం కుళ్లిన వాసన వస్తోందంటూ, ఐస్ గడ్డల్లో పెట్టినా... లక్షల విలువైన సెంట్ జల్లినా తన్నుకొస్తున్న శవం కంపు భరాయించి ఈ రాత్రంతా ఇక్కడ జాగారం చేయలేమంటూ ఉద్యోగాలు వదులుకున్నట్టు తెగేసి చెప్పి వెళ్లిపోయారు చిట్టచివరి ఆశలైన మేనేజరు... నౌకరు కూడా ఆ రెండోరోజు రాత్రి!

★ ★ ★

"హలో... మునిసిపల్ కమిషనర్... నమస్తే... నమస్తే... నేను... ద గ్రేట్... మీకు తెలుసుగా పరమేశ్వరాన్ని...

"ఆఁ... మరేం లేదు. మీకు తరచూ ప్రజల్తో జటిల సమస్యలు ఎదురౌతుంటాయిగా. నాకు ఒక ఫోన్ కొట్టండి. వెంటనే వచ్చి సెటిల్ చేసేస్తాను. మరో మంచి విషయం... ఈ మధ్య నా బెస్ట్ ఫ్రెండొకడు సెంట్రల్‌లో మంచి పొజిషన్ గల మంత్రయ్యాడు. మీరు ఏ విషయంలోను భయపడవలసిన పనిలేదు.

"అన్నట్టు... మర్చాను... మీ కో చిన్న షాక్. మొన్న ఉదయమే నా భార్య చనిపోయింది సార్... కమిషనర్‌గారూ! తీసుకెళ్లడానికి మనుషులెవరూ కలసిరాలేదు. ఇది మాయా ప్రపంచం కదా!

"రోజులు మారిపోతున్నాయి మరి. ఎదుటి వాడికి ఉపకారం చేద్దామన్న కనీస ఇంగిత జ్ఞానమే కరువైపోతోంది.

"సో... మీ మునిసిపల్ వెహికిల్‌ని, నలుగురు మనుషుల్ని పంపండి. ఆఁ... నేను వాళ్ల కష్టం ఉంచుకోను. డబ్బు ఎంతడిగితే అంతా పడేద్దాం. తప్పక అరేంజ్ చేస్తారు కదూ... మీ ఉపకారం కూడా జన్మాంతం మరచిపోనులెండి.

"అసలు నా పరిస్థితి ఏమిటో తెలుసా? మా బంధువర్గంలో వచ్చిన ఒక చిన్న సమస్య గురించి నన్ను వాళ్లంతా... వదిలేశారు. పిచ్చి వెధవలు!... వాళ్లనే నేను వదిలేశానని... వాళ్లకు తెలియదు!

"ఇంకో విషయం చుట్టు పక్కల వాళ్లతో, ఫ్రెండ్స్‌తో నేను క్లోజ్‌గా ఉండనట. వాళ్లా ఇంచుమించు దూరంగా ఉంటూ వస్తున్నారు. వెధవన్నర వెధవలు... గారవళ్లు, అక్షర అజ్ఞానులు, పూరిగుడిసె పిరికి వెధవలు. మా ఫ్రెండ్స్ సర్కిల్ అంతా పరమ రోగ్స్.

"మీరే చెప్పండి...? మన స్టేటస్‌కి తగ్గట్టుగా మనతో వాళ్లు ఎలా బిహేవ్ చేయగలరు? సమాజంలో ఒక గొప్ప, అత్యున్నత పొజిషన్‌కి వచ్చిన వ్యక్తి ఇంకా పైపై పొజిషన్‌కి వెళ్లాలికాని, తక్కువ పొజిషన్ వాళ్లతో డీలింగ్ పెట్టుకొని ఎలా దిగజారిపోగలడు? వాళ్లందరితో రాసుకు తిరగటం ఈ కంప్యూటర్ యుగంలో సంభవమే నంటారా? మీరే ఒక పెద్దాఫీసర్‌గా ఆలోచించండి. అదీ... అద్దదీ వాళ్ల ఏడుపు!

"నేనేం తక్కువ వాడినా - వెళ్లి వాళ్ల కాళ్లు పట్టకోవలసిన అ... వ... స... రం... నాకేమిటి? ఏనుగు చచ్చినా విలువే, బతికినా విలువే అన్నట్టు బతికే మనిషిని నేను. ఆ...టైమ్ ఇప్పటికే లేటయింది. మీరు వెహికిల్‌ని, మనుషుల్ని పంపుతున్నట్టేగా.

"....."

"వ్వాట్...!? మునిసిపల్ వర్కర్స్ అందరూ స్ట్రైక్ లో ఉన్నారా - మరి ముందే ఈ విషయం చెప్పొచ్చుగా... ఓ... మై...!"

"....."

"మీ రెందుకు సారీ చెప్తారు. నేను మరోలా ట్రై చేస్తాను. ఫోను పెట్టెయ్యండి."

★ ★ ★

పరమేశ్వరం నుదుటిమీద చెమట తుడుచుకోవాలని ప్రయత్నించాడు. కాని ఆ పని చేయకుండానే వాలు కుర్చీలో మళ్లీ వాలిపోయాడు.

వాలిపోయిన భార్యకళ్లు మళ్లీ తెరుచుకునే ప్రయత్నం చేస్తున్నట్టు... ఎండిపోయి డొప్పలుగా పైకి లేచాయి. ఆమె తన వైపు జాలిగా చూస్తున్నట్టు అతని క్కనిపించింది. 'ఏమండీ... మీరు చేసినా, నేను ఈ జాగారం చేయలేను. నా శవయాత్ర ముహూర్తం ఎప్పుడు?' అన్నట్టుంది ఆ జాలి చూపు.


శవంమీద ఈగలు దండయాత్ర చేస్తున్నట్టున్నాయి.

చీమలు బారులు కట్టాయి.

భరించరాని వాసన అతడిని ఇంచుమించు స్పృహ కోల్పోయేలా చేసింది. ది గ్రేట్ రిటైర్డ్ జడ్జ్ పరమేశ్వరం కీళ్ల సత్తువ కోల్పోయిన వాడిలా, రక్తం పూర్తిగా హరించుకుపోయిన వాడిలా వాలు కుర్చీలో పడి ఉన్నాడు.

అతనికి ఆకలి, ఆవేశం, ఆయాసం, నీరసం బాగా ఎక్కువైపోతున్నాయి. కనీసం తనను పైకి లేవదీసే మనిషి తోడుగా లేనందుకు చలించి పోయాడు.

గతం...




గతం... ఎప్పుడో మరచిపోయిన గతం తెరలు తెరలుగా, దొంతరలుగా చెంగున ఎగిరే లేడిపిల్లలా దూసుకొస్తోంది... అతని మనసులో... పక్కనే ఉన్న ఫైల్స్‌లోంచి పాత లెటరు తీసి కళ్లజోడు సరిచేసుకొని చూశాడు.

"ది గ్రేట్ రిటైర్డ్ జడ్జ్ పరమేశ్వరం గార్కి శతకోటి నమస్కారాలతో పెళ్లిళ్ల పెద్ద రుక్మాంగధరరావు రాయునది.

"సార్... మీ అమ్మాయి నీరజకు పెళ్లి సంబంధం కావాలి అంటూ... నాకు ఫోన్ చేశారు కదా సార్? ఫోన్‌లో వివరంగా చెప్పటం కుదరదని ఈ లెటర్ రాస్తున్నాను.

"సార్! ఒక విషయం బాగా గుర్తు చేసుకోండి. మీ ఫారిన్ అబ్బాయిగారి పెళ్లి కుదిర్చిన గుర్నాథాన్ని మీరు పెళ్లి పందిరిలోనే ఎంతో దారుణంగా అవమానపర్చారు కదా! అప్పట్నుంచీ మీ కుటుంబంలోని వారెవరికీ సంబంధాలు ఎవరూ చూడకూడదని నిర్ణయించుకున్నారు.

మీ అబ్బాయికి పెళ్లాన్ని ఎంచడానికి మాసిన బట్టల ఆకారం, చప్పిడి ముక్కు ఆకారపు మా గుర్నాథం మీకు చిరాకు అనిపించలేదు. పాపం... అదే ఆకారంతో పెళ్లిపందిరిలోకి వచ్చాడు. అప్పుడు మాత్రం మీకు అతను భిక్షగాడిగా కన్పించాడు... అనిపించాడు. స్టేటస్... స్టేటస్ సార్... మీ స్టేటస్‌కు అతను అడ్డొచ్చాడు. సార్! మీదే అంతమంచి మనస్సైతే సాటి కులంవాడే కదాని ఆరోజే, మీరే అతనికి పట్టుబట్ట లిచ్చి 'మా గుర్నాథమే' అని మీరే అతడిని పెళ్లి పందిరిలో కూర్చోపెట్టొచ్చుగా.

"పదిమందీ 'ఎవరతను?' అని అడుగుతుంటే 'భిక్షగాడు', 'అడుక్కుతినే కుక్క' అని చాలా దారుణంగా గెంటించేశారు. అతనే చెప్పి, కుదిర్చి ఉండకపోతే మీ అబ్బాయిగారి సంబంధం ఖాయమయ్యేదా సార్?

"ఇప్పుడు మీ అమ్మాయికి పెళ్లిసంబంధం కుదిర్చితే ఆనక నా గతీ అంతేకాదని గారంటీ ఏమిటి? మీకు డబ్బుంది, ఎదుటివాళ్లని ఈసడించి... చులకన చేసే స్వభావం ఉంది. మీ విషయంలో నేనే కాదు. వేరెవరూ తలదూర్చడానికి సిద్ధంగా లేరు సార్!

"ఏయ్ నే నెవర్నో తెలుసా, టాప్ పొజిషన్‌లో ఉన్న జడ్జిని. మనవాళ్లలో నా అంత కెపాసిటీ గల వ్యక్తి ఎవరైనా ఉన్నారా... నాకు నువ్వు రాసే రాత ఇదేనా" అనాలనుకుంటున్నారు కదా సార్!

"క్షమించండి... మీరు ధర్మాసనం మీద ఉన్నపుడు మీ ఎదురుగా నేను చేతులు కట్టుండడానికి సమ్మతిస్తాను. ఈ లెటర్‌లో మాత్రం తల వంచలేను సార్!

"సార్... మీరు ఫోనులో 'మనవాళ్లు' అన్నారు. మీకు బంధుత్వం కావలసి వచ్చినపుడే ఆ పదం మీ నోటి నుండి వస్తుందా? మీరు సాటి కులస్థుడు గుర్నాథం పట్ల చేసింది చాలా పెద్ద పొరపాటు సార్! కనీసం ఆ పొరపాటుని ఎప్పుడైనా సరిదిద్దుకోనే ప్రయత్నమయినా చేశారా? ఎంతసేపు మీరు, మీ హోదా. సాటివాళ్లు మీకు గిట్టరు. వాళ్లు దోమలు, ఈగలు. మీరు... సింహం! వాళ్ల శుభ కార్యాలకయినా, అశుభకార్యాలకయినా మీ రెప్పుడైనా జాయిన్ అయ్యారా? అందరూ మీకు చెప్పి చెప్పి విసుగెత్తి పోయి మీ ఇంటికి రావటం మానుకున్నారు. మీ ప్రవర్తన, పొజిషన్ చూసి బంధువులు కూడా మీ గడప తొక్కడానికి భయపడుతున్నారు. అయిష్టత చూపుతున్నారు.

"అంతెందుకు సార్? మీ అబ్బాయే మిమ్మల్ని వదలి పెళ్లాంతో వెళ్లిపోయాడే. మీ స్నేహితులు... చివరికి మీ పొరుగువాళ్లు మిమ్మల్ని చూస్తే పెద్ద పులిని చూసినట్టు భయపడుతున్నారే!

"మీ కెవరైనా నమస్కారం చేస్తే తిరిగి మీ రెప్పుడైనా ప్రతినమస్కారం చేశారా? ఒక్కసారి మీ జీవితంలో మీ రెవరినైనా చూసి చిన్న చిర్నవ్వు విసిరారా? మీ గురించి మనవాళ్లు చాలా బాడ్ గా చెప్పుకుంటున్నారు. నేను 'చాలా గొప్పవాడిని' అని ప్రతివాడు తనకు తానే అనుకుంటుంటాడు. కాని బైట ప్రపంచం ఏమనుకుంటుందో గుర్తించాలి.

"ఇంత పొడుగు లెటర్ ఎందుకు రాశానో తెలుసా సార్? మీ కెదురుగా నిలబడి నాక్కూడా మాట్లాడే ధైర్యం లేకపోవటం వల్లే. అలాటి మీతో వియ్యమందుకోమని తెలిసి తెలిసీ నే నెవర్ని అడగను. వాళ్లు మాత్రం ఎలా ఇష్టపడతారు? 'సంబంధం చూస్తాను' అని చెప్పి మీ కన్యాయం చేయలేను

సార్!

"స్టాప్, నాకు పాఠాలు నేర్పేవాడివా నువ్వు. నీకు ఎన్ని గుండెలు" అనుకుంటూ ఈ లెటర్ చింపేయాలనుకుంటున్నారు కదూ! వద్దు సార్! ఈ లెటర్ జీవితంలో మీ కెప్పుడైనా గుణపాఠం నేర్పి తీరుతుంది. కొంచెం ఆలోచించి మడతపెట్టి బీరువాలో అడుగున పడెయ్యండి సార్.

ఉంటాను,

రుక్మాంగధరరావు."

ఆనాడు పాడెయ్యకుండా దాచిన లెటర్... ఈనాడు పరమేశ్వరం మరొక్కసారి చదువుకున్నాడు. మడతపెట్టి మళ్లీ బీరువాలో ఉంచాడు.

★ ★ ★

వీథిలో వర్షం కుండపోతగా కురుస్తోంది.

కొన్ని నీటిబిందువులు ప్రహరీ గోడమీద పడి ఎగిరెగిరి చుట్టూ చిందులేస్తున్నాయి. ఆ బిందువులే పరమేశ్వరం ప్రస్తుతంలోకి వచ్చేలా చేశాయి. ఒక్కగానొక్క తన కూతురు... ఆనాడు కోట్లు ఉండీ 30 ఏళ్ల వరకూ పెళ్లిచేయలేని తన అసమర్థతకు నిదర్శనంగా ఆరోజు... ఒక రాత్రి ఎవరితోనో లేచిపోతున్నట్టు లెటరు రాసి పెట్టినా పరమేశ్వరం కనీసం చలించలేదు. కాని ఇప్పటి పరిస్థితి వేరు.

వీథిలోకి వెళ్లి రోడ్డు వరకు నడిచాడు.




తన కారు డ్రైవరు కూడా పగబట్టినట్లు రాకపోవటంతో బైట టాక్సీని మాట్లాడి దాని మీద భార్య శవాన్ని శ్మశానం వరకూ చేర్చాలని అతని ప్రయత్నం. కానీ అదీ ఫలించలేదు. ఎంత డబ్బు గుమ్మరించినా ఆ శవాన్ని చూసి అందరూ భయపడి వెనక్కుపోయేవాళ్లే.

అయిదువేల రూపాయలకు గుర్రపుబండి మాట్లాడుకున్నాడు పరమేశ్వరం. బండివాడు శవాన్ని ఎత్తి బండిలో వేయడానికి ఇష్టపడ్డాడు కాని, తన బండి ఇంతటి వానలో చివరి వరకు చేరలేదని, అక్కడి మట్టిలో కూరుకుపోయి చక్రాలు ముక్కలైనా, గుర్రం కాళ్లు విరిగినా తన జీవితమే నాశనం అవుతుందని... 10 వేలు కాదు 20వేలు ఇచ్చినా రానని ఖచ్చితంగా చెప్పి వెళ్లిపోయాడు. కాళ్లు పట్టుకొని అడిగినా ఆగలేదు...!!!

పరమేశ్వరం... ద గ్రేట్ రిటైర్డ్ జడ్జ్...

ఇప్పుడు ఇంకా పూర్తి స్పృహలోకి వచ్చేశాడు.

వానలో పూర్తిగా తడిసి ముద్దయిపోయాడు.

బట్టలు... శరీరం... మనసు పునీతం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చేశాడు.

దూరంగా వికృతంగా భార్య శవం. 'ఏమండీ.. నే నీ నరకం భరించలేకపోతున్నాను. నా శవయాత్ర తొందరగా ఏర్పాటు చేసి పుణ్యం కట్టుకోండి' అని దీనంగా రోదిస్తున్నట్టు, మూలుగుతున్నట్టు... ఈగలు, దోమలు... విచిత్ర క్రిములు రొద చేస్తున్నాయి.

పరమేశ్వరం ఆ వీథి దాటి, రోడ్డు దాటి అప్రయత్నంగా నడుస్తున్నాడు. ఎక్కడికి వెళ్తున్నాడో, ఎలా నడుస్తున్నాడో తనకే తెలియకుండానే అడుగులు మాత్రం చాలా వీథులు, సందులు, గుంటలు, మెట్టలు దాటి అలా అలా... అప్రయత్నంగా పడిపోతున్నాయి.

చిట్టచివరికి సన్నగా మూసుకుపోయినట్టున్న ఒక రోడ్... ఆ రోడ్ అంతా వర్షం వల్ల ఎగిరిన తాటాకులు, గడ్డి పడి చిందరవందరగా ఉంది. ఎప్పట్నుంచో మూలుగుతున్న పెంట పోగులు దుర్గంధాలని యథేచ్ఛగా వ్యాపింపచేస్తున్నాయి.

కసుక్కున ఒక ముల్లు అతని కాలులో దిగబడిపోయింది.

అయినా అతనికి ఆ బాధ అంతగా తెలియలేదు. కారణం... అత నో మహత్తర కార్యం సాధించడానికి కంకణం కట్టుకొని మారాజులా, రారాజులా అశ్వ, గజ దళాల చక్రవర్తిలా అడుగులు వేస్తూ నడుస్తున్నా డిపుడు.

అతని కళ్లు చుట్టూ చూశాయి. అన్నీ పూరిగుడిసెలే. మొత్తం అన్నీ కలిసి ఓ యాభై ఉంటాయి. అతని కాళ్లు ఆ రోడ్ చివర బాగా క్రుంగిపోడానికి సిద్ధంగా ఉన్న తాటాకు ఇంటి ముందు అప్రయత్నంగా ఆగిపోయాయి. అతని చేతులు పడిపోడానికి సిద్ధంగా ఉన్న తాటాకు తలుపులను చరిచాయి.

"గుర్నాథంగారూ, గుర్నాథంగారూ! నేనండీ పరమేశ్వరాన్ని." నీరసంగా పిలిచాడు పరమేశ్వరం తలుపుల మీద తడుతూనే.

గుర్నాథం తలుపులు తీసి ఆశ్చర్యపడ్డాడు.

"గుర్నాథంగారూ! నా భార్య... శవం నాలుగు రోజుల నుండీ..." మరి మాట్లాడలేక పరమేశ్వరం కళ్లవెంట కన్నీరు కార్చుకుంటూ గుర్నాథం పాదాలపై కూలబడిపోయాడు.

వాన వెలిసింది.

గుర్నాథం అతడిని కుర్చీలాంటి మట్టి దిమ్మ మీద కూర్చోపెట్టాడు.

"జరిగింది తెలిసింది పరమేశ్వరంగారూ! బాధపడకండి. ఆపద సమయంలో మిమ్మల్ని అణగదొక్కాలని మేం ఎవరం ఏ మాత్రం ప్రయత్నం చేయలేదు. కోటీశ్వరులైన మీరు మీ కులం వారినే సక్రమంగా వినియోగించుకోలేక పోయారు అంతే. గతం అంతకన్నా ఎక్కువగా తలచుకోవద్దు.

"నే నిప్పుడే 'మనవాళ్లు' అందరితో కలసి వస్తాను. మీ రింటికి వెళ్లిపొండి. మనవాళ్లే కాదు, మీ హితులు, సన్నిహితులు, మీ చుట్టూ ఉండే మీ లోకాల్టీ ప్రజలు అందరూ కలసి ఆనందంగా ఈ కార్యక్రమం పూర్తి చేసేలా నేను చేస్తాను కదా!"

గుర్నాథం ముక్కోటి దేవుళ్లు వరం ఇచ్చినట్టు చెప్పిన ఆ మాటల్తో పరమేశ్వరానికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది.

పూర్తి సత్తువ చిక్కి, గుర్నాథానికి నమస్కరించి, తల దించుకొని ఇంటి ముఖం పట్టాడు.

రేపు తన శవానికి ఇప్పటి గతి పట్టకూడదని అందుకు ఇప్పట్నుంచే మంచితనం పెంచుకోవాలి, మారని కోట్లు కాదని తెలుసుకున్నాడు ది గ్రేట్ రిటైర్డ్ జడ్జ్ పరమేశ్వరం!!

గంట క్రితం...

అతని కోట్లు... బంగారాలు... పాలస్‌లు... అహం...

నలుగురు మనుషుల్ని సంపాదించి అతడి భార్య శవాన్ని కదిలించలేకపోయాయి.

ఇప్పు డతను నోరు విప్పి 'ప్రేమ' పంచితే కోటి మంది అతని వెనుక రావడానికి సిద్ధపడ్డారు. ●